క్లుప్తంగా

వాహన తనిఖీలు

వీరఘట్టం: వాహనదారులు రోడ్డుభద్రత నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్సై కిషోర్‌వర్మ అన్నారు. వీరఘట్టం–పాలకొండ రోడ్డులో బుధవారం వాహన తనిఖీలు చేశారు. గతంలో పెనాల్టీలు ఉన్న వాహనదారులకు ఆన్‌లైన్‌లో బకాయిలు చెల్లించేలా అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు పరిత మిత వేగంతో ప్రయాణాలు చేసి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ



చింతడ అప్పలనాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలోని పరుశురాంపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చింతడ అప్పలనాయుడు, రఘుమండల బాలకృష్ణ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం వారిని పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, కన్వీనర్ డి.జనార్దనరావు, సీనియర్ నాయకలు శెట్టి మధుసూదనరావు, తదితరులు ఉన్నారు.

కాలువలపై సిమ్మెంటు పలకల ఏర్పాటు

వీరఘట్టం: రూ.5.50 కోట్ల నిధులతో జరుగుతున్న వీరఘట్టం ప్రధాన రహదారి పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన కాలువలపై బుధవారం సిమెంటు పలకలు ఏర్పాటు చేశారు. సుమారు కిలోమీటరు పొడవున ఉన్న ఈ కాలువలపై ప్రాదాన్యతా క్రమంలో పలకలు ఏర్పాటు చేస్తున్నామని కాంట్రాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అలాగే రోడ్డుకు ఆనుకుని ఉన్న వీధుల వద్ద దృఢమైన సిమెంటు పలకలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా అసిరితల్లి పండగ

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో అసిరితల్లి పండగను మూడో రోజు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఘటాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు జరిపించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు.

గ్రామదేవత పండగకు ఆహ్వానం



ఐటీడీఏ పీఓకు ఆహ్వాన పత్రికను ఇస్తున్న కమిటీ సభ్యులు

సీతంపేట: వీరఘట్టం గ్రామదేవత పండగకు ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి కల్పనాకుమారిని ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 30 నుంచి మే 10వ తేదీ వరకు గ్రామదేవత పండగను వైభవంగా నిర్వహించనున్నామన్నారు.

భామినిలో భారీ వర్షం

భామిని: మండలంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు, పంటపొలాల్లో నీరు చేరింది. తయారీలో ఉన్న ఇటుకలు తడిచిపోవడంతో నష్టపోయామని బట్టీయజమానులు వాపోయారు. వేసవి దుక్కులు, మెట్టు పొలాల్లో సాగు చేసే పంటలకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

స్ప్రేయింగ్‌పై దృష్టి సారించాలి

- డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో స్ప్రేయింగ్‌పై దృష్టి సారించాలని ప్రోగ్రాం అధికారులను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.బి.జగన్నాథరావు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాయంలో ప్రోగ్రాం అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. మలేరియా, డెంగీ జ్వరాలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. దోమలు ప్రబలకుండా ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్ సక్రమంగా జరిగేలా చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రోగ్రాం అధికారులకు కేటాయించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఐఎంఆర్, ఎంఎంఆర్‌ను తగ్గించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ఎప్పటికప్పుడు సందర్శించి అందరు వైద్యాధికారులు సమయ వేళలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆయనన్నారు. ఫ్యామిలీ డాక్టరులో14 రకాల పరీక్షలు, 68 రకాల మందులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌బీఎస్‌కె ప్రాజెక్టు అధికారి డా.ధవళ భాస్కరరావు, ప్రోగ్రాం అధికారులు నవీన్, జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శం



ఉత్తమ పంచాయతీ అవార్డు పొందిన వెలగవాడ గ్రామం



గుమ్మలక్ష్మీపురంలో పారిశుద్ధ్య పనుల్లో గ్రీన్ అంబాసిడర్లు

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రగతిపథంలో పంచాయతీలు
- ఉత్తమ పంచాయతీలుగా వెలగవాడ, గుమ్మలక్ష్మీపురం

పాలకొండ రూరల్, గుమ్మలక్ష్మీపురం: పల్లెలు దేశానికి పట్టుకొమ్మలన్న నానుడిని నిజం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోంది. గ్రామ సచివాయాలు, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల చెంతకు పాలనను తీసుకువచ్చింది. అధికార యంత్రాంగం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిపై దృష్టి సారిస్తోంది. పంచాయతీలు సాధిస్తున్న ప్రగతికి అనుగుణంగా ప్రభుత్వం వాటికి అవార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. జాయతీ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గుమ్మలక్ష్మీపురం పంచాయతీ ఆరోగ్యవంతమైన పంచాయతీగా(థీమ్–2 విభాగంలో), పాలకొండ మండలం వెలగవాడ పంచాయతీ నీటి సమృద్ధి విభాగంలో జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయి.

ప్రతి ఇంటికీ కుళాయి..

మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న వెలగవాడ పంచాయతీలో 2,781 మంది జనాభ, 867 ఇళ్లు ఉన్నాయి. గ్రామస్తుల తాగునీటి అవసరాలకు 20వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత నీటి పథకం ఉన్నా తాగునీటి సమస్య వేధిస్తుండేది. ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా రూ.14 లక్షలు, పంచాయతీ నిధులు రూ.11 లక్షలు ఖర్చు చేసి ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. 18 చేతిపంపు బోర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య పరిష్కారం లభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యానికి పెద్దపీట

సుమారు 3500 మంది జనాభా ఉన్న గుమ్మలక్ష్మీపురం గ్రామం స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుస్తోంది. ప్రభుత్వ నిధులతో అన్ని వీధుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతూ స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దారు.

గ్రీన్‌అంబాసిడర్లు ప్రతిరోజు ఇళ్ల నుంచి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తుండడంతో గ్రామంలో ఎక్కడా చెత్తపోగు కనిపించదు. పంచాయతీని పరిశుభ్రంగా ఉంచేందుకు సర్పంచ్ బొత్తడ గౌరీశంకరరావు, వార్డు సభ్యులు చేస్తున్న కృషికి గ్రామస్తులు, పంచాయతీ అధికారులు సహకారం తోడవ్వడంతో జిల్లాస్థాయిలో ఆరోగ్యవంతమైన పంచాయతీగా అవార్డు అందుకుంది.

నిబద్ధతకు ఫలితం

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. వీటిపై గ్రామస్తుల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. అధికారులు, గ్రామసచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమన్వయంతో స్వచ్ఛపంచయాతీగా తీర్చిదిద్దాం. మా అందరి సమష్టికృషికి ఫలితం దక్కింది.

– బొత్తాడ గౌరీశంకరరావు, సర్పంచ్, గుమ్మలక్ష్మీపురం

సమస్య తీరింది

గ్రామంలో రక్షిత పథకం ఉన్నా తాగునీటి సమస్య అధికంగా ఉండేది. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే మరింత ఇబ్బందులు ఉండేవి. నీటికోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. ప్రతీ ఇంటికీ కుళాయి వేశారు. పుష్కలంగా నీరు అందుతోంది. చాలా సంతోషంగా ఉంది.

– ఎల్.దుర్గమ్మ, వెలగవాడ పంచాయతీ, పాలకొండ మండలం

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం



సంక్షేమ లబ్ధి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి
- తాలాడలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

సీతంపేట: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. తాలాడ గ్రామ సచివాలయం పరిధి వెంకటిగూడ, చీడిమానుగూడ, లంగడుగూడ తదితర గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు హారతులతో స్వాగతం పలికారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. నవరత్న పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని తెలియజేసే పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు చిన్నచిన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా.. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేయూత, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ఎంతో లబ్ధి చేకూరుస్తున్నాయన్నారు. పార్టీలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎక్కడైనా ఎటువంటి సమస్య వచ్చినా వార్డు వలంటీర్, సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్తే అక్కడి ఉద్యోగులు సమస్యలను పరిష్కరిస్తారన్నారు. గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో పండ్లతోటల పెంపకం



మాట్లాడుతున్న ఏపీఓ తులసీదాస్

భామిని: పండ్లతోటల పెంపకంపై రైతులు దృష్టిసారించేలా ఉపాధిహామీ సిబ్బంది వారిని ప్రోత్సహించాలని ఏపీఓ ఇ.తులసీదాస్ అన్నారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఉపాధిహామీ పథకం కింద వ్యవసాయ పనులతో పాటు ఉద్యానవనాలు, పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. మండలంలో కనీసం 80 ఎకరాల్లో తోటల పెంపకం టార్గెట్‌గా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఎకరానికి సుమారు రూ.1.30 లక్షలు వరకు ఉపాధి నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. జీడితోటల పెంపకంతో అధిక ఆదాయం వస్తుందని రైతులకు వివరించాలన్నారు.

సర్వేరాళ్ల ఏర్పాటు వేగవంతం

పాలకొండ: సమగ్ర భూ సర్వేలో భాగంగా సరిహద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని గ్రామీణ సర్వేయర్‌లు, వీఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలోను రోజుకు 100కు తక్కువ కాకుండా హద్దురాళ్లు వేయాలని సూచించారు. గ్రామాల్లో కూలీలను ఏర్పాటు చేసుకుని త్వరితగతిన పనులు పూర్తిచేయాలన్నారు. మండల సర్వేయర్ వెంకటరావు ఉన్నారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

సీతంపేట: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు బుధవారం రాత్రి విడుదల అయ్యాయి. ఫలితాల్లో బాలుర కంటే బాలికలు పైచేయి సాధించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఈ సారి ఉత్తీర్ణత శాతం పెరిగింది. ముఖ్యంగా గురుకుల విద్యార్థులు పరీక్షల్లో సత్తాచాటారు. మల్లి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి 80 మంది ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా.. 73 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో ఆరిక ప్రశాంత్ 447, బైపీసీలో సవర శాంతికుమార్ 414 మార్కులు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 80 మంది హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో సవర శంకరరావు 969, బైపీసీలో కె.అజయ్ 931 మార్కులు సాధించారు. స్థానిక బాలికల గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌లో 116 మందికి 102 మంది పాసయ్యారు. ద్వితియ సంవత్సరంలో 171 మంది విద్యార్థులకు 157 మంది పాసయ్యారు. ఎంపీసీలో సవర విద్యాకుమారి (957), బైపీసీలో వి.శ్రీజ (953), హెచ్‌ఈసీలో శ్రీజ (950) మార్కులు సాధించారు. అలాగే బాలుర గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరంలో 154 మందికి గాను 123, ద్వితీయ సంవత్సరంలో 147కు 118 మంది ఉత్తీర్ణత సాధించారు. ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి కల్పనాకుమారి, గిరిజన సంక్షేమశాఖ డీడీ నగేష్, ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ యుగంధర్, గురుకులం సెల్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు విద్యార్థులను అభినందించారు.

- పాలకొండ రూరల్: స్థానిక బాలుర జూనియర్ కళాశాల నుంచి 194 ద్వితీయ ఇంటర్ పరీక్షలు రాయగా.. 97 మంది ఉత్తీర్ణులయ్యారు. వై.మధు(బైపీసీ)లో 950 మార్కులు, అకౌంట్ అండ్ ట్యాక్సినేషన్ విభాగంలో సవర ముఖలింగం 949, తోయక శ్రీలేఖ 939 మార్కులు సాధించారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో వి.నవీన్ 917, ఎం.తరుణ్ 878, సీఈసీలో ఎం.తరుణ్ 878, హెచ్‌ఈసీలో జి.వాసు 850 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి తెలిపారు. అలాగే బాలికల జూనియర్ కళాశాల నుంచి ద్వితీయ సంవత్సరం బైపీసీలో ఎస్.కుమారి 946, కూరంగి సులోమి 936 మార్కులు సాధించారు.
- వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో 131 మంది విద్యార్థులు ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాయగా వారిలో 83 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పైల శంకరరావు తెలిపారు. ఎస్.నందిని 949 (ఎంపీసీ), బి.గాయత్రి 902(బైపీసీ), కె.సాయిలక్ష్మి 912 (సీఈసీ), బి.చరణ్‌కుమార్ 652(హెచ్‌ఈసీ) విభాగాల్లో కళాశాల టాపర్లుగా నిలిచారు. అలాగే ఫస్టియర్ నుంచి 112 మంది పరీక్షలకు హాజరుకాగా..21 మంది పాసయ్యారు.
- **వృత్తివిద్యలో శతశాతం..**

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అక్కౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ (ఎఅండ్‌టీ) వృత్తి విద్యాకోర్సులో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించారు. ఇంటర్ ఫస్టియర్‌లో 19 మంది పరీక్షలకు హాజరు కాగా 19 మంది విద్యార్థులు ఏ గ్రేడ్‌లో పాసయ్యారు. జె.కీర్తన 500 మార్కులకు గాను 477 మార్కులు, ఎస్.స్రవంతి 476, జ్యోతి 473, అంజిలి, కుమారిలు 466 మార్కులు సాధించారు. అలాగే సెకండ్ ఇయర్‌లో 20 మందికిగాను 20 మంది ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించారు. శ్రీలత 1000 మార్కులకు గాను 956, ఎస్.గీత 946, బుజ్జిప్రమీల 941, శైలజ 939 మార్కులు సాధించారు.

- కొమరాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 130 మంది హాజరుకాగా.. 107 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 153 హాజరుకాగా.. 38 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వై.నాగేశ్వరరావు తెలిపారు.
- గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ జూనియర్ కళాశాల (పీటీజీ) నుంచి 113 మంది ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాయగా.. 79 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్ పరీక్షలకు 146 మంది హాజరుకాగా..128 మంది ఉత్తీర్ణ సాధించారు. ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ జూనియర్ కళాశాల నుంచి ఫస్ట్ ఇయర్ పరీక్షకు 99 మంది హాజరుకాగా..49 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్ పరీక్షలకు 112 మంది హాజరుకాగా 94 మంది ఉత్తీర్ణులయ్యారు. గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ నుంచి ప్రథమ సంవత్సర పరీక్షలకు 38 మంది హాజరుకాగా వారిలో 10 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 35 మంది హాజరుకాగా 22 మంది ఉత్తీర్ణులయ్యారు. గుమ్మలక్ష్మీపురం జూనియర్ కళాశాల నుంచి మొత్తం 274 విద్యార్థులు ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాయగా.. 70 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్ పరీక్షలకు 228 మంది హాజరుకాగా..120 మంది ఉత్తీర్ణులయ్యారు.
- భామిని: భామిని ఏపీ మోడల్ స్కూల్, కళాశాల నుంచి ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 110 మంది హాజరు కాగా.. 66 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 90 మంది హాజరుకాగా 62 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. అలాగే భామిని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి 42 మంది సెంకట్ ఇయర్ పరీక్షలు రాయగా.. 27 మంది పాసయ్యారు. 23 మంది ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాయగా.. 17 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ కె.విజయనిర్మల తెలిపారు. కేజీబీవీలో ఫస్ట్ ఇయర్ సీఈసీ నుంచి 28 మంది పరీక్షలకు హాజరుకాగా 8 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారని ఎస్ఓ బి.శారద తెలిపారు.
- జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీపీ విద్యార్థిని కె.సుప్రియ 907 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. అలాగే సీఈసీలో సింగిపురం బుజ్జి 745 మార్కులు సాధించాడు.

ప్రగతిని వివరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ..



కొండచిలకాంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఉత్సాహంగా సాగిన 'గడపగడపకు మన ప్రభుత్వం'
- పాల్గొన్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని కొండచిలకాం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం రెండో రోజు కొనసాగింది. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ మూడున్నరేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రయత్నించారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం అందించలేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ప్రతీ గడపకూ సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారన్నారు. జగనన్న మళ్లీ సీఎం అయితే ప్రతీ ఇళ్లు సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గణేష్, ఏపీఎంఎస్ ఎంఈ డైరెక్టర్ మూడడ్ల గౌరీశంకరరావు, జెడ్పీటీసీ శశికళ, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, అప్పారావు అల్లు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చినగీసాడలో..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చినగీసాడ గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కుంబురుక దీనమయ్య బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి పాల్గొనే ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

రైతులకు మేలు చేయాలి



గోపాలకృష్ణను అభినందిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, తదితరులు

కొమరాడ: శివిని ప్రాథమిక సహకార సంస్థను అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు రైతులకు అందుబాటు ఉంటూ సేవలందించాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా పప్పల గోపాలకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం సొసైటీల ద్వారా రైతులకు అతి తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తోందన్నారు. రైతుల రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొసైటీ చైర్మన్ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. తనకు సొసైటీ చైర్మన్ పదవి వచ్చేలా సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. పీఏసీఎస్ అభివృద్ధికి, రైతులకు మేలు చేసేందుకు అంకిత భావంతో పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ పాండురంగ, డైరెక్టర్ పైల వెంకటరమణ, ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, కన్వీనర్ డి.జనార్దనరావు, సీనియర్ నాయకులు శెట్టి మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై హెచ్‌ఎంలకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ నాగభూషణరావు

జియ్యమ్మవలస: మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఆడిట్‌పై హెచ్‌ఎంలకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆడిట్‌లో గుర్తించాల్సిన అంశాలపై ఎంఈఓ ఎస్.నాగభూషణరావు, రిసోర్స్‌పర్సన్ జి.సూర్యనారాయణ అవగాహన కల్పించారు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, మనబడి–నాడునేడు కింద జరుగుతున్న అభివృద్ధి పనులు, జగనన్న గోరుముద్ద పథకం అమలుపై ఆడిట్ చేయాలని సూచించారు. తల్లిదండ్రుల కమిటీ పాత్ర, సమగ్ర విద్యా అవగాహన, బడిబయట పిల్లల కవరేజీ, మధ్యాహ్న భోజన పథకం అమలు, తదితర 107 అంశాలను పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ నెల 29లోగా ఆడిట్ ప్రక్రియ పూర్తిచేసి నివేదికలు సమర్పించాలన్నారు.

ట్యాంకులతో తాగునీరు సరఫరా



పాలవలసలో నీరు పడుతున్న ఆదివాసీ మహిళలు

భామిని: తివ్వాకొండలు, గిరిశిఖర గ్రామాల్లోని ఆదివాసీలకు వేసవిలో తాగునీరు సమస్య లేకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. మండలంలో పాలవలస, డోకులగూడ, జియ్యమానుగూడ, కడంబసింగి గిరిజన గ్రామాలకు బుధవారం నుంచి ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అమరాన సందీప్ తెలిపారు. అంచెలంచెలుగా మిగతా గ్రామాలకు నీరు అందిస్తామన్నారు.

హెచ్‌ఎంలకు శిక్షణ



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ జనార్దనరావు

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కావాల్సిన అవసరాలను హెచ్‌ఎంలు గుర్తించాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ కె.జనార్దనరావు అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల అభివృద్ధి ప్రణాళికలపై హెచ్‌ఎంలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నాడు–నేడు పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టేలా చూడాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. హెచ్‌ఎంలు సి.హెచ్.రత్నాకరరావు, యు.భాస్కరరావు, దూసి నాగమణి, కె.సుధీర్, కె.పి.నాగమణి, బి.సాంబర తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఐటీడీఏ పీఓ

సీతంపేట: పీవీటీజీ గిరిజనుల సర్వే పకడ్బందీగా చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి కల్పనాకుమారి అన్నారు. బుధవారం తన కార్యాలయం నుంచి పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో ట్రైబల్ సబ్‌ప్లాన్ మండలాల తహసీల్దార్లు, ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీవీటీజీ కుటుంబాలు ఎన్ని ఉన్నాయి, పక్కా గృహాలు ఎంతమందికి ఉన్నాయి, ఇంకా విద్యుత్ సదుపాయాలు లేని కుటుంబాలు ఏమైనా ఉన్నాయా తదితర వివరాలతో కూడిన సర్వేను ఈ నెల 29లోగా పూర్తి చేయాలన్నారు. నెట్‌వర్క్ లేని గ్రామాలు, తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామాల వివరాలు సేకరించాలన్నారు.

సమగ్ర సమాచారం సేకరించాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: మండలంలోని 32 పంచాయతీలు, వాటి అనుబంధ గ్రామాల్లో నివశిస్తున్న ఎస్టీ కమ్యూనిటీలో గల గదబ, సవర వివరాలను ఈనెల 27లోగా సిద్ధం చేయాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినిరింగ్ సహాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో రహదారులు, మౌలిక వసతులు, విద్యుత్, అంగన్‌వాడీ కేంద్రాలు, టెలిఫోన్ సౌకర్యం వంటి అంశాల తాజా పరిస్థితులు, ప్రధాన మంత్రి ఆవాస యోజనా పథకం లబ్ధిదారుల సమాచారం నివేదికలో పొందుపరచాలన్నారు. అలాగే వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు.

- భామిని: కొండ ప్రాంతంలో నివశించే పీవీటీజీ స్థితిగతులపై సర్వే చేసి పూర్తి వివరాలు అందించాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు సిబ్బందిని ఆదేశించారు.